నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I హైదరాబాద్, శనివారం 15 ఫిబ్రవరి 2025 | HYDERABAD

## అసువులు బాసి.. జీవితాల్లో వెలుగులు నింపి


రాజేందర్‌రెడ్డి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 14: తాను మరణించినా అవయవదానంతో పలువురి జీవితాల్లో వెలుగులు నింపాడో అన్నదాత. జగిత్యాల జిల్లా గొడిసెలపేటకు చెందిన రాజేందర్‌రెడ్డి (35) రైతు. ఇటీవల ఇంట్లో నిద్రిస్తుండగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా, చికిత్స పొందుతూ ఈ నెల 13న బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టతను వివరించగా, అందుకు అంగీకరించారు. ఆయన శరీరం నుంచి కాలేయం, రెండు మూత్రపిండాలను సేకరించినట్లు జీవన్‌దాన్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీభూషణ్ రాజు తెలిపారు.

## 600 కిలోల హానికరమైన చికెన్ స్వాధీనం



సిటీబ్యూరో, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ టాస్క్ ఫోర్స్, నార్త్‌జోన్ బృందం, కంటోన్మెంట్ శానిటరీ ఆఫీసర్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సికింద్రాబాద్‌లోని చికెన్ సెంటర్లపై దాడులు నిర్వహించారు. ఎస్ఎస్ఎస్ చికెన్ సెంటర్, రవి చికెన్ షాపులపై చేసిన దాడుల్లో హానికరమైన 600 కిలోల చికెన్ వేస్టేజ్, ఎముకలను స్వాధీనం చేసుకున్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు, వైన్‌షాపులకు ఈ హానికరమైన చికెన్‌ను సరఫరా చేసేందుకు చికెన్ షాపుల ఓనర్లు ప్లాన్ చేసుకున్నారని, విశ్వసనీయ సమాచారంతో తాము దాడులు చేసి నిర్వాహకులు ఎం భాస్కర్, బొట్ట రవీందర్‌ను అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు.

# వేర్లూనుకుపోయిన అవినీతి..!

## విద్యుత్ శాఖలో అక్షయ పాత్రలా.. ఆ ఐదు సర్కిళ్ల పోస్టింగులు

- అత్యధికంగా సైబర్ సిటీ సర్కిల్ పరిధిలోనే ఏసీబీ కేసులు నమోదు
- కాసులిస్తే కారు దిగకుండానే సీఈజీఐ నిరభ్యంతర ధ్రువపత్రాలు



*సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ):*

- సైబర్ సిటీ సర్కిల్ పరిధిలోని ఒక ప్రాంతంలో వివాదాస్పద భూమి (కోర్టులో కేసు పెండింగు)లో ప్లాట్లకు మీటర్లు ఇచ్చేందుకు భారీ మొత్తాన్ని పుచ్చుకున్నారు. దీనిపై ఫిర్యాదులు పోవడంతో ఉన్నతాధికారులు ఒక అధికారిని బదిలీ చేయడంతో పాటు పలువురు అధికారులపై బదిలీ వేటు వేశారు. కానీ రోజుల వ్యవధిలోనే సదరు అధికారి పైరవీ చేసి ప్రభుత్వ పెద్ద ఒకరి ఆశీర్వాదంతో బదిలీ ఉత్తర్వులను రద్దు చేయించుకున్నారు. తిరిగి అదే స్థానంలో దర్జాగా విధులు నిర్వహిస్తున్నారు.
- తాజాగా ఇదే సైబర్ సిటీ సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి ఏడీఈ కార్యాలయంలో రెండు అపార్టుమెంట్లకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఏడీఈ రూ. లక్ష లంచం డిమాండు చేశారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు నిబంధనల ప్రకారమే రూ.4-5 లక్షలు అవుతుంది. అదనంగా ఏడీఈకి అమ్యామ్యాలు. సదరు యజమాని ఇంతకుముందే రూ.25వేలు ఇచ్చారు. పాత బాకీ రూ.25, రెండో దానికి రూ. 50వేలు.. మొత్తం రూ.75వేలు ఇస్తేనే రెండో ట్రాన్స్‌ఫార్మర్ అమరుస్తామన్నారు. కడుపు మండిన యజమాని ఏసీబీకి సమాచారం ఇచ్చారు. శుక్రవారం రూ.50వేలు ఇస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.




*ఇదీ... విద్యుత్ శాఖలో వేర్లూనుకుపోయిన అవినీతికి ఓ మోస్తరు ఉదాహరణలు. కానీ బయటికి రాకుండా ఏటా కోట్లాది రూపాయలు అక్రమంగా చేతులు మారుతున్నాయి. అందుకే సైబర్ సిటీతో పాటు దక్షిణ డిస్కం పరిధిలో మరో నాలుగు సర్కిళ్ల పరిధుల్లో పోస్టింగులు అంటేనే భారీ డిమాండు. ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే! మరోవైపు బహుళ అంతస్తులతో పాటు వ్యాపార, పారిశ్రామిక కనెక్షన్లకు సీఈజీఐ నుంచి ఇవ్వాల్సిన నిరభ్యంతర ధ్రువపత్రం కోసం ఒక్కో కేసులోనే లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి.*

### అక్కడ కనిపించని అవినీతి కొండంత...

విద్యుత్ కొత్త కనెక్షన్ల వెనక అవినీతి భాగోతం ఇలా ఉంటే... భారీ నిర్మాణాలకు సంబంధించి కనెక్షన్లకు పొందాల్సిన ఎన్‌వోసీ జారీ అనేది కనిపించని అవినీతికి కేంద్రంగా మారింది. సాధారణంగా 15, అంతకుమించి మీటర్ల ఎత్తు ఉన్న బహుళ అంతస్తుల నిర్మాణాలకుగానీ భారీ వ్యాపార సముదాయాలు, పరిశ్రమలకు కరెంటు కనెక్షన్ మంజూరైతే... విద్యుత్ ప్రధాన తనిఖీ అధికారి (సీఈఐజీ - చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ టు గవర్నమెంట్) విభాగం వారు పరిశీలించి అన్ని రకాలు మంచిగా ఉందంటూ ఎన్‌వోసీ జారీ చేయాల్సి ఉంటుంది. పైగా ప్రతి సంవత్సరం ఈ ఎన్‌వోసీలను రెన్యువల్ కూడా చేయాల్సి ఉంటుంది. ఇదే ఆ విభాగానికి కాసుల వర్షాన్ని కురిపిస్తుందనే ఆరోపణలున్నాయి. సదరు తనిఖీ అధికారులు కారు దిగకుండానే దళారుల ద్వారా లక్షల రూపాయలు పుచ్చుకొని తనిఖీలు లేకుండా ఎన్‌వోసీలు జారీ చేస్తున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి. గతంలోనూ ఈ విభాగంలో ఏసీబీ వలకు చిక్కిన అవినీతి తిమింగళాలు కూడా ఉన్నాయి.

### ఏసీబీ వలకు అవినీతి చేపలు..

విద్యుత్ శాఖలో తరచూ అవినీతి నిరోధక శాఖ వలకు అవినీతి చేపలు పడుతూనే ఉన్నాయి. కానీ బయటికిరాని ఇలాంటి అవినీతి భాగోతాలు ఎన్నో.. ప్రాణాలు లెక్క చేయకుండా కిందిస్థాయి ఆర్టిజెన్స్ సేవలు అందిస్తుంటే ఎగువ స్థాయిలో మాత్రం కుర్చీ కదలకుండా జోరుగా కాసుల దందా కొనసాగుతున్నది. అందుకే దక్షిణ డిస్కం పరిధిలోని ప్రధానంగా ఐదు సర్కిళ్ల పరిధుల్లో పోస్టింగుల కోసం భారీ ఎత్తున డిమాండు ఉంది. సైబర్ సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, మేడ్చల్‌తో పాటు సంగారెడ్డి సర్కిళ్ల పరిధుల్లో పోస్టింగుల కోసం లక్షలాది రూపాయలు ఇచ్చి వచ్చామని పలువురు అధికారులు బహిరంగంగానే చెబుతారు. ఈ ప్రాంతాల్లో కొత్త నిర్మాణాలు రావడంతో పాటు అపార్టుమెంట్లు, వ్యాపార, పారిశ్రామిక సముదాయాలు ఎక్కువగా వస్తాయి. దీంతో వీటికి కరెంటు కనెక్షన్లు ఇచ్చేందుకు పెద్ద ఎత్తునే చేతులు తడపాల్సి వస్తున్నది. అందుకే కేవలం గత ఆర్నెల్ల వ్యవధిలోనే నగరంలో వివిధ హోదాల్లోని ఏడుగురు విద్యుత్ శాఖ అధికారులు అవినీతి నిరోధక శాఖకు పట్టుబడ్డారు. అవినీతి ఫిర్యాదుల నేపథ్యంలో ఉన్నతాధికారులు మరో తొమ్మిది మందికి షోకాజు నోటీసులు జారీ చేశారు. ఇక... పైరవీలు లేకపోతే ఆ అధికారులకు పాతబస్తీ, కార్యాలయ విధులే శరణ్యం అవుతాయనేది విద్యుత్ శాఖలో బహిరంగ రహస్యం. అందుకే ఈ రెండు ప్రాంతాల్లో విధులను నాన్ ఫోకల్ పోస్టులుగా అభివర్ణిస్తారు.

## దేవాదాయ భూముల్లో ఆక్రమణలపై సర్కారుకు నివేదిక?

### మేడ్చల్ జిల్లాలో 221 అక్రమ నిర్మాణాల గుర్తింపు

మేడ్చల్, ఫిబ్రవరి14(నమస్తే తెలంగాణ): దేవాదాయ భూముల్లో అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వానికి నివేదిక అందించేందుకు మేడ్చల్ జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. మేడ్చల్ జిల్లాలోని దేవాదాయ భూముల్లో సుమారు 221 అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు రెవెన్యూ యంత్రాంగం గుర్తించినట్లు సమాచారం. రెవెన్యూ యంత్రాంగం గుర్తించిన అక్రమ నిర్మాణాల నివేదికపై జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులతో ఇటీవలే సమీక్ష నిర్వహించారు. నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు. జిల్లాలో 1620 ఎకరాల దేవాదాయ భూములు ఉండగా, అత్యధికంగా తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవరయాంజల్‌లోనే 1,531 ఎకరాల దేవాదాయశాఖ భూమి ఉంది. దేవాదాయ భూములు వందలాది ఎకరాలు కబ్జాలకు గురికాగ..దేవాదాయ భూముల రక్షణకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఐఏఎస్ అధికారుల చే త్రీసభ్య కమిటీని నియమించగా, దేవాదాయ భూములు కబ్జాలు గురైన వాటిని గుర్తించి నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో త్రీసభ్య కమిటీ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక ఆధారంగానే అధికారులు భూములతో పాటు అక్రమ నిర్మాణాలను గుర్తించినట్లు తెలుస్తున్నది. దేవరయాంజల్‌లో 55 నుంచి 63 639-641, 656-657, 660 -682, 686-718, 736 సర్వే నంబర్లలో ఉన్న భూమి దేవాదాయ భూమిగా గుర్తించారు. ఇందులో సుమారు 221 అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు జిల్లా రెవెన్యూ యంత్రాంగం తేల్చినట్లు తెలుస్తున్నది. అక్రమ నిర్మాణాలపై పూర్తి ఆధారాలతో సిద్ధం చేసిన నివేదికపై ప్రభుత్వం ఇచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.


## హెచ్‌ఎండీఏ భూమికి ఎసరు

### రక్షణగా నియమిస్తే కబ్జా కథ నడుపుతున్న సెక్యూరిటీ గార్డు

సిటీబ్యూరో: కంచె చేను మేసిన చందంగా తయారైంది... ఆ హెచ్‌ఎండీఏ భూమి తీరు. విలువైన స్థలాన్ని కాపాడేందుకు అధికారులు కాపలాగా ఓ సెక్యూరిటీ గార్డును నియమిస్తే అతనే ఆ భూమి కబ్జా కథను నడిపిస్తుండటం గమనార్హం. మియాపూర్‌లో హెచ్‌ఎండీఏకు సంబంధించి భారీ విస్తీర్ణంలోనే భూములు ఉన్నాయి. సర్వేనంబర్ 100లో ఉన్న భూముల్లో కొంతకాలం కిందట వివిధ జిల్లాల నుంచి వచ్చిన నిరుపేదలు పెద్ద ఎత్తున గుడిసెలు వేసేందుకు సిద్ధం కావడం... చివరకు పోలీసుల సహకారంతో హెచ్‌ఎండీఏ అధికారులు వారిని వెనక్కి పంపించడం తెలిసిందే. ఈ క్రమంలో దానికి సమీపంలోనే సర్వేనంబర్ 20,21ల్లో కూడా సుమారు 2500 చదరపు గజాల స్థలం ఉంది. మియాపూర్-బొల్లారం రహదారికి అనుసరించి ఉండటంతో ఈ భూమి విలువ గజం దాదాపు రూ.2 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ నేపథ్యంలో హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులు ఆ భూమికి రక్షణగా ఒక సెక్యూరిటీ గార్డును నియమించారు. క్రమేణా అతను అక్కడే చిన్నపాటి గుడిసెలు వేయించడంతో పాటు హోటల్ వంటి చిన్నపాటి వ్యాపారాలకు షెడ్లు వేసేందుకు సహకరించారు. అంతేకాదు వారి నుంచి నెలకు అద్దె కూడా తీసుకుంటున్నట్లు సమాచారం. వాస్తవానికి ఈ విషయం హెచ్‌ఎండీఏ అధికారులకు తెలియకుండా ఉండదు. కానీ ఎందుకు పట్టించుకోవడంలేదనేది సందేహాలకు కారణమవుతున్నది. ఇదే అదునుగా భావించిన సదరు సెక్యూరిటీ గార్డు ఒక మహిళ పేరిట జీవో 59 కింద దరఖాస్తు చేయించి ఆ స్థలాన్ని కాజేసేందుకు పావులు కదుపుతున్నట్లు విశ్వసనీయం సమాచారం.ఈ తతంగంలో కొందరు స్థానిక నేతల హస్తం కూడా ఉందనే ఆరోపణలున్నాయి.

## డాక్టర్ అరుణ కుమారి.. టెన్త్ ఫెయిల్!

దుండిగల్, ఫిబ్రవరి 14: పదో తరగతి పాస్ కాలేదు.. కానీ..ఏకంగా డాక్టర్‌గా చెలామణీ అవుతూ...ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఓ నకిలీ వైద్యురాలి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధుల బృందం శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రెండు క్లినిక్‌లు, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, మల్లంపేటలోని నాలుగు క్లినిక్ లపై దాడులు నిర్వహించింది. ప్రైవేట్ ప్రాక్టీస్ పేరుతో కొందరు ఎటువంటి అర్హతలు లేకుండానే వైద్యశాలలు నిర్వహిస్తున్నట్లు గుర్తించింది. ఎంబీబీఎస్ వంటి డిగ్రీలు లేకుండానే అల్లోపతి వైద్యం నిర్వహిస్తూ, రోగులకు విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్, వ్యాక్సిన్సు , పెయిన్ కిల్లర్లు ఇస్తున్నట్లు తేలింది. నిజాంపేటలో బుచ్చిబాబు క్లినిక్ పేరుతో అరుణ కుమారి అనే నకిలీ వైద్యురాలు ఏకంగా మహిళలకు అబార్షన్లు చేస్తున్నట్లు గుర్తించారు. ఆమె కనీసం టెన్త్ క్లాస్ కూడా పాస్ కాలేదని కమిషన్ సభ్యులు పేర్కొన్నారు. ఇలాంటి వారు అందించే వైద్యంతో రోగులు మరింత ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నకిలీ వైద్యుల గుర్తింపులో భాగంగా తరచూ ఇటువంటి తనిఖీలు చేపడుతున్నామని, ఇప్పటికే తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 400కు పైగా నకిలీ వైద్యులను గుర్తించి కేసులు నమోదు చేశామన్నారు. ఒక్క హైదరాబాద్ మహానగర పరిధిలోనే ఇప్పటివరకు 150 పైగా కేసులు నమోదైనట్లు చెప్పారు. ప్రైవేట్ ప్రాక్టీషనర్స్ పేరుతో ఎటువంటి అర్హతలు లేకుండా అల్లోపతి వైద్యం అందిస్తున్న వారితో పాటు, ఆయుర్వేద ఇతర వైద్యాశాలలో పేరుతోనూ అల్లోపతి వైద్యం అందించడం నేరమన్నారు. కనీసం పదో తరగతి ,ఇంటర్ కూడా ఉత్తీర్ణులు కానీ వారు అందించే వైద్యంతో ప్రజలకు హాని జరుగుతుంది తప్ప.. ఎటువంటి మేలు జరగదన్నారు .వీరిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా , నిజాంపేటలోని బుచ్చిబాబు క్లినిక్, యష్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ,మల్లంపేటలోని శ్వేతా క్లినిక్, సహజ హాస్పిటల్, జే.జే ఫస్ట్ ఎయిడ్ సెంటర్ లతో పాటు మొత్తం 6 క్లినిక్‌లలో తనిఖీలు నిర్వహించామని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.



**బుచ్చిబాబు పేరుతో క్లినిక్**

**ఎంబీబీఎస్ లేకున్నా.. అల్లోపతి వైద్యం.. అబార్షన్లు సైతం చేస్తున్న వైనం నిజాంపేటలో నకిలీ వైద్యురాలి వ్యవహారం వెలుగులోకి..**

**కుత్బుల్లాపూర్ వ్యాప్తంగా నేషనల్ మెడికల్ కౌన్సిల్ బృందం తనిఖీలు పలు క్లినిక్‌లపై దాడులు..**

**అర్హత లేకున్నా వైద్యం అందిస్తున్నట్లు గుర్తింపు**

## సందర్శించి..సూచనలిచ్చి

### కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన గూగుల్ బృందం



సిటీబ్యూరో: గూగుల్ ఇండియా ప్రతినిధుల బృందం తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోలింగ్ సెంటర్‌ను శుక్రవారం సందర్శించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను అధ్యయనం చేయడంతో పాటు గూగుల్ యొక్క అత్యాధునిక సాంకేతిక పరిష్కారాలను వినియోగించి మరింత మెరుగుపరచడానికి కావాల్సిన సూచనలను గూగుల్ ప్రతినిధులు నగర పోలీసులకు అందించారు. గూగుల్ ప్రతినిధులకు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ టీజీఐసీసీసీ కార్యకలాపాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇందులో రియల్ టైమ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఎలా నిర్వహించబడుతుందో, అధునాతన నిఘా వ్యవస్థలు, డేటా అనలిటిక్స్, గూగుల్ మ్యాప్స్ డేటాను అనుసంధానం చేయడం ద్వారా రద్దీ ప్రాంతాలను గుర్తించడం వంటి అంశాలను వివరించారు. ప్రధానంగా గూగుల్ మ్యాప్స్ లైవ్ ట్రాఫిక్ డేటాను టీజీఐసీసీసీకి అనుసంధానం చేయడం, వాహనాల స్థితిని ఆధారంగా చేసుకొని ఆటోమేటెడ్ ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను అభివృద్ధి చేయడం, రియల్ టైమ్‌లో గస్తీ వాహనాల ట్రాకింగ్, ట్రాఫిక్ పర్యవేక్షణ కోసం డ్రోన్ నిఘా అమలు వంటి అంశాలపై చర్చించారు. ఇటీవల గూగుల్, ప్రభుత్వం మధ్య కుదిరిన ఒప్పందం నేపథ్యంలో గూగుల్ టీమ్ టీజీఐసీసీసీని సందర్శించినట్లు ప్రతినిధులు తెలిపారు. ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్, అడ్మిన్ జాయింట్ సీపీ జె పరిమళ హన నూతన్, ఐసీసీసీ ఎస్పీ పుష్ప, గూగుల్ డీప్ మైండ్ వైస్ ప్రెసిడెంట్ చందు తోట తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను విమర్శించే హక్కు లేదు

### ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



సిటీబ్యూరో: ఏ ఒక్క రోజు కూడా తెలంగాణ జెండా పట్టని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించే నైతిక హక్కు లేదని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. 14 సంవత్సరాల పాటు తెలంగాణ కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమ నాయకుని పై ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు.చావు నోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన ఘనత కేసీఆర్ ది అని అన్నారు. ఎలాంటి త్యాగం చేయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్యాగాలు చేసిన వ్యక్తుల గురించి మాట్లాడడం మానుకోవాలని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రేవంత్‌రెడ్డి అడ్రస్ లేదన్నారు. ఒక ఉద్యమ నేతను పట్టుకొని నోటికొచ్చినట్లు మాట్లాడితే బాగుండదన్నారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆమె తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సర కాలంలోనే అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నా..పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలంలో చేసింది సున్నా అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చమంటే.. ఉద్యమ నేత కేసీఆర్‌ను విమర్శించడం మంచి పద్ధతి కాదన్నారు. నోరు ఉంది కదా అని..ఇష్టానుసారంగా మాట్లాడితే.. ప్రజలు గమనిస్తున్నారన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి చెప్పారు. పాలనను గాలికి వదిలేసి విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆమె ఆరోపించారు. హామీలు నెరవేర్చడానికి అవకాశాలు లేక కేసీఆర్‌ను విమర్శించి ప్రజల దృష్టిని మళ్లించడానికి ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

